నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
5 | హైదరాబాద్, సోమవారం 8 జనవరి 2024 | RANGAREDDY

ఆర్టీసీని లాభాల బాటలో నడిపించాలి

మాట్లాడుతున్న రీజినల్ మేనేజర్ శ్రీదేవి

షాద్‌నగర్‌టౌన్, జనవరి 7 : ఆర్టీసీని లాభాల బాటలో నడిపించాల్సిన బాధ్యత ఆర్టీసీ ఉద్యోగులపై ఉందని రీజినల్ మేనేజర్ శ్రీదేవి అన్నారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు షాద్‌నగర్ ఆర్టీసీ డిపోలో డీఎం మేనేజర్ ఉష ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వనభోజన మహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా వారి గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. అనంతరం వనభోజనాలు చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం : ఎమ్మెల్యే శంకర్

కొత్తూరు, జనవరి 7: కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం కొత్తూరు మండంలోని ఎస్‌బీపల్లిలో రూ. 25 లక్షలతో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, రూ. 25 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రూ. 65 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ అంబటి ప్రభాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తూరు మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, జడ్పీటీసీ శ్రీలత, మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, ఎంపీటీవో శరత్‌చంద్రబాబు, ఏఈ హేమంత్, ఉప సర్పంచ్ దయానంద్‌గుప్తా, రవికుమార్ గుప్తా పాల్గొన్నారు.

పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

తప్పులు లేకుండా నమోదు చేయాలి

ప్రజాపాలన దరఖాస్తుల వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ చీమ వెంకన్న

షాద్‌నగర్‌టౌన్, జనవరి 7: ప్రజాపాలన దరఖాస్తుల వివరాలను తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్ చీమ వెంకన్న ఆపరేటర్లకు సూచించారు. ఆదివారం దరఖాస్తుల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలోని 28వార్డులకు సంబంధించి వచ్చిన ప్రజాపాలన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలన్నారు. ఏదైనా సందేహం ఉంటే వెంటనే సంబంధిత అధికారిని అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ నమోదులో ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తి చేయాలన్నారు. అదే విధంగా మున్సిపాలిటీకి సంబంధించి ప్రజాపాలన దరఖాస్తులు మొత్తం18355వచ్చాయని తెలిపారు.

విద్యార్థులకు రెస్క్యూటీంపై శిక్షణ

రెస్క్యూటీం శిక్షణలో కంటింజెంట్ లీడర్ డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి, విద్యార్థులు

షాద్‌నగర్‌టౌన్, జనవరి 7 : కేంద్ర ప్రభుత్వం కేంద్ర వయోజన, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో హిమాచల్‌ప్రదేశ్ జార్ఖండ్‌లో సాహస క్రీడలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, పాలమూరు విశ్వవిద్యాలయ పరిధిలోని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రెస్క్యూటీం శిక్షణలో పాల్గొన్నారని (నేషనల్ అడ్వెంచర్ క్యాంపు) కంటింజెంట్ లీడర్ షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ సామ రవీందర్‌రెడ్డి తెలిపారు. రెస్క్యూటీం శిక్షణ ద్వారా ఆపద సమయాల్లో ఎలా స్పందించాలి, ఏ విధంగా కాపాడాలో తెలుస్తుందన్నారు. ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు ఆ ప్రదేశం నుంచి గాయపడ్డ వారిని ఎలా తీసుకురావాలి, అత్యవసరాల్లో గాయపడిన వ్యక్తులను స్ట్రెచర్‌తో ఏ విధంగా కాపాడాలో, తాళ్లతో స్ట్రెచర్ తయారు చేసే విధానంపై శిక్షణ ఇచ్చారని తెలిపారు. ఈ శిక్షణను విజయవంతంగా పూర్తి చేస్తున్న కంటింజెంట్ లీడర్, విద్యార్థులను ట్రెక్కింగ్ నిర్వాహకులు, ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టర్ రామకృష్ణ, యూనివర్సిటీ కో-ఆర్డినేటర్ ప్రవీణ్ అభినందించారు.

ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షింతలు

షాబాద్ మండలం చర్లగూడలో శ్రీరాముడి అక్షింతలు ఊరేగిస్తున్న గ్రామస్తులు

షాబాద్, జనవరి 7: అయోధ్య రామ మందిరం అక్షింతలు ఇంటింటికీ పంపిణీ చేస్తున్నట్లు వినాయక సేవా సమితి సభ్యులు తెలిపారు. ఆదివారం షాబాద్ మండల పరిధిలోని చర్లగూడ గ్రామంలో అయోధ్య నుంచి తీసుకువచ్చిన రాముడి అక్షింతలను ఊరేగించి హనుమాన్ దేవాలయంలో పూజలు చేశారు. ఈ నెల 15వ తేదీ వరకు అక్షింతల వితరణ ఉంటుందన్నారు.

ఫరూఖ్‌నగర్ మండలంలో..

షాద్‌నగర్‌రూరల్ : ఫరూఖ్‌నగర్ మండలంలోని వివిధగ్రామాలు, షాద్‌నగర్ మున్సిపాలిటీలో అయోధ్య రాముడి అక్షింతలను రామభక్తులు పంపిణీ చేస్తున్నారు.

తట్టిఅన్నారంలో..

పెద్దఅంబర్‌పేట : అయోధ్య రాముడి అక్షింతలు ఇంటింటికీ పంపిణీ కార్యక్రమం మున్సిపాలిటీలో వైభవంగా కొనసాగుతున్నది. ఆదివారం తట్టిఅన్నారంలోని లలితాభువనేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం నుంచి జీవీఆర్ కాలనీ పెద్దలు అయోధ్య రాముడి అక్షింతలు ఊరేగింపుగా తీసుకెళ్లి ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కే మహేందర్, గ్రామ పెద్దలు మద్ది శ్రీకాంత్‌రెడ్డి, గోపాల్‌గౌడ్, కార్తీక్ పాల్గొన్నారు.

యాచారం : మండలంలోని కుర్మిద్ద గ్రామంలో రాములోరి అక్షింతలను ఆదివారం సత్యనారాయణస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ నర్సింహ, రామాంజనేయ భక్తి భజన మండలి ప్రతినిధులు నర్సింహ, అంజయ్య, స్వచ్ఛంద కార్యకర్త మల్కాపురం శివశంకర్, నాయకులు పాల్గొన్నారు.

చేవెళ్లటౌన్ : చేవెళ్ల గ్రామంలో శ్రీరామ భక్తులు ఇంటింటికీ అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామ భక్తులు, భజన మండలి సభ్యులు ఉన్నారు.

శంకర్‌పల్లి : మండల పరిధిలోని మహరాజ్‌పేట్ గ్రామంలో ఆదివారం వార్డు సభ్యులు బద్రి శ్రీకాంత్, రవీందర్ ఇంటింటికీ శ్రీరాముడి అక్షింతలు అందజేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న కౌకుంట్ల జడ్పీహెచ్ఎస్ 2004-05 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు -చేవెళ్ల రూరల్

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9640400073/9160900024.
NT-319407-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న, లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఉద్యమ నాయకులపై కేసులు ఎత్తివేయాలి

ఇబ్రహీంపట్నం, జనవరి 7 : తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకపాత్ర పోషించిన ఇబ్రహీంపట్నం తెలంగాణ జేఏసీ నాయకులు ఆదివారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఉద్యమం సమయంలో పెట్టిన కేసులను వెంటనే తొలగించేందుకు కృషిచేయాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఉద్యమ నాయకులు రవీందర్‌గుప్తా, గౌస్, జంగయ్య, అంజయ్య, అబ్దుల్ ఉన్నారు.

టార్గెట్ 17

- పదిరోజుల్లో అభయ హస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదుకు అధికారుల యత్నం
- రోజుకు 50వేలకు పైగా నమోదు చేస్తేనే 17 లోపుగా పూర్తికానున్న ప్రక్రియ
- జిల్లాలో వచ్చిన మొత్తం దరఖాస్తులు 5,53,277
- గ్రామ పంచాయతీల్లో 500 మంది డేటా ఎంట్రీ అపరేటర్లతో ఆన్‌లైన్‌లో నమోదు
- ఇతర సమస్యలపై వచ్చిన 95,886 దరఖాస్తుల గురించి లేని స్పష్టత
- గృహ జ్యోతి, మహాలక్ష్మి, రేషన్ కార్డు దరఖాస్తులే అధికం!

రోజుకు 50వేల దరఖాస్తులు ఆన్‌లైన్‌లోకి...

రంగారెడ్డి, జనవరి 7(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో 'అభయ హస్తం' దరఖాస్తులు పోటెత్తాయి. ఎనిమిది రోజులపాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో మొత్తం 5,53,277 దరఖాస్తులు వచ్చాయి. ఎక్కువగా గృహ జ్యోతి, మహాలక్ష్మి, రేషన్ కార్డులకు సంబంధించిన దరఖాస్తులే ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ నెల 17 వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో అధికార యంత్రాంగం కుస్తీ పడుతోంది. రూరల్ ప్రాంతాల్లో వచ్చిన దరఖాస్తుల కోసం 500 మంది ఆపరేటర్లతో దరఖాస్తుల డేటాను ఎంట్రీ చేయిస్తున్నారు. ఆదివారం సెలవు దినం అయినప్పటికీ ఈ ప్రక్రియ కొనసాగింది. అయితే ఐదు పథకాలు కాకుండా ఇతర సమస్యలపై వచ్చిన దరఖాస్తుల్లోని వివరాలను ప్రస్తుతం ఎంట్రీ చేయడం లేదు. వీటిపై ప్రభుత్వం ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు.

జిల్లాలో 21 మండలాల్లోని 558 గ్రామ పంచాయతీల నుంచి 2,91,470 దరఖాస్తులు, 16 మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల నుంచి 2,61,807 దరఖాస్తులు వచ్చాయి. లక్షల్లో వచ్చిన దరఖాస్తులను ఈనెల 17లోపుగా ఆన్‌లైన్‌లో నమోదు చేయడం సవాల్‌గా మారింది. ఉపాధిహామీ, సెర్ప్, మండల, రెవిన్యూ, విద్యాశాఖతోపాటు ఇతర ప్రభుత్వ విభాగాల్లో పనిచేసే కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లను డేటా ఎంట్రీకి ఎంపిక చేశారు. దరఖాస్తుల కంప్యూటరీకరణకు ఇంకా ఆపరేటర్లు అవసరం పడుతుండడంతో ప్రైవేటు వారిని కూడా తీసుకుంటున్నారు. ప్రతి ఆపరేటర్‌కు ఒక ఐడీ, పాస్‌వర్డ్‌ను కేటాయించారు. ప్రత్యేకంగా లాగిన్ కేటాయించి ఫోన్‌కు వచ్చే ఓటీపీ సాయంతో డేటా ఎంట్రీ చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా, మండల స్థాయి అధికారుల పర్యవేక్షణలో కంప్యూటరీకరణ జరుగుతున్నది. దరఖాస్తు నమోదు పూర్తయిన వెంటనే దరఖాస్తు దారుని ఫోన్‌కు రిజిస్ట్రేషన్ నంబరుతో సందేశం వస్తుందని అధికారులు చెబుతున్నారు. దరఖాస్తులోని 27 అంశాలను పథకాల వారీగా నమోదు చేసేందుకు ఒక్కో దరఖాస్తుకు 7 నిమిషాలకు పైనే పడుతున్నది. గడువులోగా ఈ ప్రక్రియ పూర్తి కావాలంటే ప్రతి రోజు యాభై వేల దరఖాస్తులను ఎంట్రీ చేయాల్సి ఉంటుంది.

ఆ రెండు పథకాలకే ఎక్కువ దరఖాస్తులు!

జిల్లాలో ఉన్న కుటుంబాల సంఖ్య కంటే దరఖాస్తులే ఎక్కువగా వచ్చాయి. అర్బన్ ప్రాంతంలో 2,88,361 కుటుంబాలు ఉంటే, రూరల్ ఏరియాలో 2,46,626 కుటుంబాలు ఉన్నాయి. ఒకే ఇంటి కుటుంబ సభ్యులైనప్పటికీ చాలామంది వేర్వేరుగా దరఖాస్తులు చేసుకోవడం, తెల్ల రేషన్ కార్డులేని వారు సైతం దరఖాస్తు చేసుకున్నారు. అయితే దరఖాస్తుల్లో ఎక్కువగా మహాలక్ష్మి, గృహ జ్యోతి పథకాలకే దరఖాస్తులు ఎక్కువగా వచ్చినట్లు తెలుస్తోంది. మహాలక్ష్మి పథకంలో మహిళలకు రూ.2,500, రూ.500కే గ్యాస్ బండను అందించనున్నారు. గృహ జ్యోతిలో ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల విద్యుత్తును ఉచితంగా ఇవ్వనున్నారు. తదుపరి ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, చేయూత దరఖాస్తులున్నట్లు తెలుస్తోంది. అభయహస్తం ఐదు పథకాలతోపాటు రేషన్ కార్డు, ఇతర వ్యక్తిగత లబ్దికి సంబంధించి తెల్లకాగితంపై విజ్ఞప్తులు వచ్చాయి. ఈ తరహా దరఖాస్తులు అర్బన్ ఏరియాలో 47,551 దరఖాస్తులు, రూరల్ ఏరియాలో 48,335 దరఖాస్తులు కలిపి మొత్తం 95,886 వచ్చాయి. ఇందులో అత్యధికంగా కొత్త రేషన్ కార్డుల కోసమే వచ్చినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. అభయ హస్తం దరఖాస్తులను ప్రత్యేక వెబ్‌సైట్‌లో నమోదు చేస్తుండగా..ఇతర సమస్యలపై వచ్చిన దరఖాస్తుల విషయమై ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పష్టత లేకపోవడంతో వాటిని అధికారులు ఎంట్రీ చేయక పక్కన బెట్టారు. అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తయి ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతుండగా..ఇప్పటి వరకు అర్హుల ఎంపికకు సంబంధించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాలేదు. మార్గదర్శకాలు వచ్చాక మరో దఫా సర్వే చేసి అర్హుల పేర్లను పోర్టల్‌లో ఉంచుతారని అధికారవర్గాలు చెబుతున్నాయి

కేటీఆర్‌ను కలిసిన సతీశ్‌రెడ్డి

షాబాద్, జనవరి 7: బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆదివారం నగరంలోని తెలంగాణ భవన్‌లో పార్టీ శ్రేణులతో కలిసి బీఆర్ఎస్ షాబాద్ మండల యూత్ అధ్యక్షుడు పీసరి సతీశ్‌రెడ్డి కలిశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయానికి సైనికుల్లా పనిచేయాలని కేటీఆర్ సూచించినట్లు తెలిపారు.

ముగిసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

షాద్‌నగర్‌రూరల్, జనవరి 7 : 6 గ్యారెంటీలను ఇచ్చేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తుల స్వీకరించేందుకు శ్రీకారం చుట్టిన ప్రజాపాలన కార్యక్రమం శనివారం నాటితో ముగిసింది. ఫరూఖ్‌నగర్ మండలంలో 19589 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో వినయ్‌కుమార్ తెలిపారు. వాటిని పారదర్శకంగా పరిశీలించి అర్హులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

మెరుగైన సేవలందిస్తాం

కొత్తూరు, జనవరి 7: నూతన పంచాయతీ భవనం అందుబాటులోకి రావడం వల్ల ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తామని మక్తగూడ సర్పంచ్ కాట్న రాజు అన్నారు. ఆదివారం కొత్తూరు మండలంలోని మక్తగూడలో ఎన్నార్జీఎస్ నిధులు రూ. 25 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని సర్పంచ్ కాట్న రాజు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పొన్నమ్మ, వార్డు మెంబర్లు శ్రీను, నరేశ్, వరలక్ష్మి, సౌజన్య, దేశ్యానాయక్, కో ఆప్షన్ మెంబర్లు చందర్‌నాయక్, నర్సింహ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు
భారీగా హాజరైన భక్తులు

బోనాలు సమర్పించడానికి వెళ్తున్న భక్తులు

కల్యాణం.. కమనీయం

ఘనంగా కొనసాగుతున్న మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు

మొయినాబాద్, జనవరి 7 : చిలుకూరు మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ మల్లేశ్, ఎంపీపీ నక్షత్రం, చిలుకూరు సర్పంచ్ స్వరూప, మాజీ ఉప సర్పంచ్‌లు ఆంజ్రూ, గోపాల్‌రెడ్డి, నర్సింహాగౌడ్, ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

బోనాల ఊరేగింపు...

శివసత్తుల పూనకాలు... పోతురాజుల విన్యాసాలు... డప్పుల దరువులు... డోలు వాయిద్యాల మధ్య మహిళలు బోనాలను ఎత్తుకుని ఊరేగింపుగా బయలుదేరి వెళ్లారు. మల్లికార్జున స్వామితో పాటు ఎల్లమ్మకు బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు హైదరాబాద్ నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. చిలుకూరు, ముర్తుజాగూడ గ్రామాలకు చెందిన భక్తులు అన్నదానం ఏర్పాటు చేశారు. సీఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఉత్సవాల్లో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ అనంతరెడ్డి, మాజీ సర్పంచ్ సుధాకర్‌యాదవ్, కాంగ్రెస్ చేవెళ్ల ఇన్‌చార్జి భీంభరత్, నేతలు శ్రీరాములు, మల్లారెడ్డి, నరేందర్, జయవంత్, సుభాష్‌గౌడ్, యాదయ్య, శ్రీనివాస్‌గౌడ్, నవీన్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు రామకృష్ణాగౌడ్, రాంచంద్రయ్య, మాజీ ఉపసర్పంచ్ అంజిరెడ్డి పాల్గొన్నారు.

వాల్ క్యాలెండర్ అవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి.

ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ అవిష్కరణ

ఆమనగల్లు, జనవరి 7: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘానికి సంబంధించిన రంగారెడ్డి జిల్లా నూతన సంవత్సర క్యాలెండర్, టేబుల్ క్యాలెండర్‌ను ఆదివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సదానందంగౌడ్, జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పాండురంగారెడ్డి, ఆర్థిక కార్యదర్శి బాల నర్సింహ, ఆమనగల్లు మండల అధ్యక్ష, కార్యదర్శులు సుదర్శన్‌రెడ్డి, రామలక్ష్మణ్ పాల్గొన్నారు.

స్నేహితురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

యాచారం, జనవరి 7 : ఆపదలో ఉన్న స్నేహితురాలి కుటుంబానికి అండగా నిలిచారు చిన్ననాటి స్నేహితులు. మండలంలోని నందివనపర్తి గ్రామానికి చెందిన తెలగమల్ల పరమేశ్వరీ తండ్రి ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందాడు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి పరమేశ్వరీ కుటుంబం వీధిన పడింది. దీంతో తన చిన్ననాటి స్నేహితులు పరమేశ్వరి కుటుంబానికి అండగా నిలిచారు. తనతో పాటు చదువుకున్న కొంత మంది స్నేహితులు కలిసి రూ.14,500లను తన తల్లికి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో రాఘవేందర్, రామకృష్ణ, రజిత, శ్రీలత, రవి కుమార్, మల్లేశ్, మధుకర్ పాల్గొన్నారు.

'దుండగులను కఠినంగా శిక్షించాలి'

ఆమనగల్లు, జనవరి 7 : సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కల్వకుర్తి నియోజకవర్గ గౌడ సంఘం అధ్యక్షుడు చుక్క అల్లాజీగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆమనగల్లు పట్టణంలో దాడిని ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు.అనంతరం పాపన్నగౌడ్ విగ్రహాన్ని గౌడ సంఘం నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో గౌడ సంఘం ఆమనగల్లు మండల అధ్యక్షుడు చుక్క నిరంజన్‌గౌడ్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గంగా రవీందర్ గౌడ్, మున్సిపాలిటీ అధ్యక్షుడు వెంకటయ్య గౌడ్, నాయకులు సత్యనారాయణ, నరేశ్, శివ, సతీశ్, నర్సింహ, నారాయణ, లక్ష్మీపతి, నిరంజన్, బాలకృష్ణ పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యమే లక్ష్యం

కొత్తూరు, జనవరి 7: పేదలకు నాణ్యమైన వైద్యాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని సర్పంచ్ బ్యాగరి సత్తయ్య అన్నారు. ఆదివారం కొత్తూరు మండలంలోని గూడూరులో రూ. 25 లక్షలతో నిర్మించిన ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను సర్పంచ్ సత్తయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్య సమస్యలు వస్తే మండల కేంద్రం కొత్తూరుకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. గూడూరులో హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయడంతో మరింత నాణ్యమైన వైద్యం అందుతుందన్నారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు వడ్డ యాదయ్య, దీపిక, గుండు సురేశ్, మైలారం ఉషారాణి, మైలారం యాదయ్య, సుమలత, మంజుల, శారద, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గూడూరులో ప్రైమరీ సబ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ బ్యాగరి సత్తయ్య

సంస్కృతి, సంప్రదాయాలకు ఎంతో విశిష్టత

కడ్తాల్, జనవరి 7: మన దేశ సంస్కృతి, సంప్రదాయాలకు ఎంతో విశిష్టత ఉన్నదని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ వ్యవస్థాపకురాలు కోర్పోలు లీలమ్మ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామంలో బాల చైతన్య కేంద్రాల నిర్వాహకుడు రజనీకాంత్ ఆధ్వర్యంలో, సీజీఆర్ సంస్థ సహకారంతో సంక్రాంతి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భోగి మంటలు వేసి, విద్యార్థులకు ముగ్గులు, మ్యూజికల్ చైర్, పతంగుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో సీజీఆర్ ఫౌండర్ లక్ష్మారెడ్డి, ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి, నరసింహారెడ్డి, ఎర్త్ సెంటర్ డైరెక్టర్ సాయిభాస్కర్‌రెడ్డి, బాల చైతన్య కేంద్రాల నిర్వాహకుడు రజనీకాంత్, కోఆర్డినేటర్లు దీపిక, మాసినా బేగం, మౌనిక, శిరీష, మమత, సర్పంచ్ శంకర్, సీజీఆర్ ప్రతినిధులు వెంకటేశ్, కోటయ్య, బీరేశ్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

భోగి మంటలు వేస్తున్న సీజీఆర్ వ్యవస్థాపకురాలు లీలమ్మ

ఇబ్రహీంపట్నంలో దరఖాస్తుల వెల్లువ

ఇబ్రహీంపట్నం, జనవరి 7 : నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో 1,07,539 దరఖాస్తులు అందినట్లు ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి తెలిపారు. ఆదివారం మంచాల మండలం నుంచి 18,694, యాచారం 16,970, ఇబ్రహీంపట్నం 10,371, అబ్దుల్లాపూర్‌మెట్ 15,414, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 8,894, ఆదిబట్ల మున్సిపాలిటీలో 6,256, తుర్కయాంజాల్ మున్సిపాలిటీలో 22,834, పెద్దఅంబర్‌పేటలో 17000 దరఖాస్తులు అందినట్లు తెలిపారు.